20102023-DIS-08_Layout 1 10/20/2023 1:42 AM Page 1



## నమస్తే తెలంగాణ

# గాజాలో ఘోర కలి

**ఇజ్రాయెల్** దాడులతో దద్దరిల్లుతున్న గాజాలో ఓ హాస్పిటల్‌పై జరిగిన క్షిపణి దాడిలో 500 మందికి పైగా మరణించిన ఘటన ప్రపంచాన్ని కలచివేసింది. ప్రధాని మోదీతో సహా ప్రపంచదేశాల అధినేతలు దాడిని ఖండించి గాజా ప్రజలకు సానుభూతి తెలిపారు. ఘటనపై ఇజ్రాయెల్, పాలస్తీనా వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. హమాస్ జరిపిన మెరుపు దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ దండయాత్ర జరుపుతున్న సంగతి తెలిసిందే. సహజంగానే అందరూ హాస్పిటల్‌పై దాడి ఇజ్రాయెల్ పనే అని మొదట్లో భావించారు. హమాస్ రాకెట్ దారితప్పి దవాఖానపై పడి ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయెల్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు 'అవతలి టీం' వాళ్ల పనే అన్నారు. అంటే హమాస్ అని అర్థం చేసుకోవాలి. ఆ సంగతి అలా ఉంచితే, పనిలోపనిగా బైడెన్ ఇజ్రాయెల్‌కు ఓ సలహా ఇచ్చారు. గాజాలో సామాన్య ప్రజలకు సహాయం అందించే అవకాశం ఏ మాత్రం ఉన్నా ఇజ్రాయెల్ అందుకు తప్పక చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా ఆగ్రహావేశాల వల్ల తప్పిదాలు చేసిందని, ఇజ్రాయెల్ అలాంటివి చేయకుండా ఉండాలని ఆయన చెప్పడం గమనార్హం.

గాజా యుద్ధంపై మారుతున్న ప్రపంచ వైఖరికి బైడెన్ మాటలు ఓ సూచికగా నిలుస్తాయి. వైట్‌హౌజ్‌ను ముట్టడిస్తున్న పాలస్తీనా అనుకూల ఆందోళనకారులను దృష్టిలో పెట్టుకొని ఆయన ఆ మాటలు అని ఉండొచ్చు. కానీ, గాజా ప్రజల విషయంలో అమెరికాకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని తెలిపే ఘటన ఐక్యరాజ్యసమితిలో జరిగింది. బహిరంగ జైలు లాంటి గాజా పరిస్థితి ప్రస్తుత యుద్ధంతో పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. గాజా ప్రజలు పడుతున్న కష్టాల గురించి చెప్పేందుకు మానవీయ సంక్షోభం అనే మాటలు కూడా సరిపోవడం లేదు. గాజాలో యుద్ధం ఇజ్రాయెల్, హమాస్ మధ్యన జరుగుతున్నప్పటికీ దానివల్ల నలిగిపోతున్నది అక్కడి సామాన్య ప్రజలే. ఓ వైపు లక్షల సంఖ్యలో ప్రజలను గాజా ఖాళీచేసి వెళ్లాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. మరోవైపు కరెంటుతోపాటు కనీస అవసరాల సరఫరాను నిలిపివేసింది. యుద్ధం కారణంగా ప్రజలు చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురు అవుతున్నారు. ఇండ్లు బూడిద కుప్పలవుతున్నాయి. ఈ నేపథ్యంలో హాస్పిటల్ ఘటన జరగడంతో ప్రపంచం ఉలిక్కిపడింది. గాజా ప్రజలను ఆదుకునేందుకు ఏదైనా చేయాలనే ప్రయత్నాలు ఐక్యరాజ్య సమితిలో మొదలయ్యాయి.

బాధితులకు తక్షణ సాయాన్ని అందించేందుకు యుద్ధానికి 'మానవీయ విరామం' కల్పించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో బ్రెజిల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటోతో ఎగరగొట్టింది. అందుకు అమెరికా చూపుతున్న కారణాలు కుంటిసాకులుగానే కనిపిస్తున్నాయి. 'ఇజ్రాయెల్ ఆత్మరక్షణ' అనే మాటలు లేనందున తీర్మానం తమకు ఆమోదయోగ్యం కాదని అమెరికా అంటున్నది. బైడెన్ దౌత్యం సాఫల్యత పొందడానికి తగిన సమయమూ ఇవ్వాలట. సాయం విషయంలోనూ ఆధిపత్యం కావాలనేది అమెరికా ధోరణిలా కనిపిస్తున్నది. ప్రపంచం ఇలా మీనమేషాలు లెక్కిస్తుంటే అటు గాజా ప్రజలు దిక్కులేని పరిస్థితుల్లో ఊరట కోసం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తూనే ఉన్నారు. రెండేండ్లుగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు పశ్చిమ ఆసియాలో తాజా సంక్షోభం ప్రపంచాన్ని కుతకుతలాడిస్తున్నది.



## మేమూ ఆలోచిస్తాం

కాంగ్రెస్ పెద్దలు మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి కేవలం ఆరు స్థానాల గురించి ఆలోచిస్తామంటున్నారు. అట్లయితే ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం గురించి కూడా మేమూ ఆలోచిస్తాం.

**- అఖిలేష్ యాదవ్, ఎస్పీ అధినేత**

# ప్రియాంకా.. చరిత్ర తెలుసుకో!

**ఇవాళ జరిగేది నిన్న మనం చేసిన పనుల ఫలితమైతే, రేపు జరిగేది నేడు మనం తీసుకునే నిర్ణయాలు, చేసే పనుల ఫలితమే! అందుకే గతాన్ని గుర్తుచేసుకుంటూ, ఇవాళ జరిగేది చూస్తూ భవిష్యత్తు ప్రగతి కోసం సరైన నిర్ణయాలు తీసుకోవటం చాలా అవసరం. ఇక ఇప్పుడు ఏం జరుగుతోంది?**

**మాజీ ప్రధానమంత్రులైన ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాహుల్‌గాంధీ వారసులుగా తాము భారతదేశ ప్రధానమంత్రి పదవి పొందాలని ఉవిళ్లూరుతున్న ప్రియాంక వాద్రా, రాహుల్‌గాంధీ తెలంగాణ నేలను పావనం చేశారు. మరికొద్ది రోజుల్లో వారి మాతృమూర్తి సోనియాగాంధీ కూడా వారి ప్రవచనం ఇవ్వటానికి తెలంగాణ రాష్ట్రానికి రాబోతున్నారు. ఇక ఇప్పుడు వచ్చినవారు ఈ ప్రజలకు ఇచ్చిన సందేశం ఏమిటో విశ్లేషిద్దాం.**



కనకదుర్గ దంటు
89772 43484



ప్రియాంక వాద్రా చాలా గౌరవప్రదంగా, గంభీరంగా మాట్లాడింది. చూడటానికే కాకుండా, వినటానికి కూడా ముచ్చటగా, మర్యాదగా తను చెప్పదలచుకున్నది సూటిగా, సుత్తిలేకుండా చెప్పింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ, కర్ణాటకలోనూ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేసింది, కాంగ్రెస్ గెలిచింది. అయితే అది కాంగ్రెస్ పార్టీ ఘనత అనే కంటే, భారతీయ జనతా పార్టీ దుష్పరిపాలన, పక్షపాత ధోరణి, విచ్చలవిడి అవినీతి వల్ల ఆ పార్టీ ఓడిపోయి, ఇంకొక పార్టీ దిక్కులేక ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నుకున్నారని చెప్పకతప్పదు. కొంతమంది నిజంగా బీజేపీని ఓడిద్దామని కాంగ్రెస్‌పై ఇష్టం లేకపోయినా ఓటేస్తే, ఇంకొంతమంది కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తాయిలాలు చూసి మోసపోయి ఓటేశారు. ఎలా అయితేనేం, అరవై ఏండ్లు దేశాన్ని పాలించి, సామాన్య ప్రజలను గాలికివదిలేసి, తెలివి ప్రజ్ఞ కలిగి చదువుకున్న మేధావులకు సరైన ఉద్యోగాలు కల్పించకుండా వారు విదేశాలకు తరలిపోతుంటే గుడ్లప్పగించి చూస్తూ, దేశంలో వివిధ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా తమ అవినీతి కార్యక్రమాన్ని యథేచ్ఛగా సాగించింది కాంగ్రెస్ పార్టీ నెహ్రూ, గాంధీ యుగాలలో. ఇప్పుడు వారసత్వ రాజకీయాలని విమర్శిస్తూ 4వ తరం వారసురాలు, వారసుడు వచ్చారు తెలంగాణ ప్రజలకు తెలివి నేర్పడానికి! ఇక ప్రియాంకా వాద్రా (గాంధీ) ఏం చెప్పిందో చూద్దాం!

రామప్ప దేవాలయం చూసి ప్రియాంకా ఒళ్ళు పులకరించిపోయిందట. అటువంటి సుందరమైన దేవాలయం ఇంతమటుకు చూడలేదంది. మరి 75 ఏండ్ల కిందట అధికారంలోకి వచ్చిన కుటుంబంలో 50 ఏండ్లు దాటిన మనిషి, జీవితమంతా రాజకీయాలలో మునిగితేలి, తమ దేశంలో ఉన్న ప్రసిద్ధ దేవాలయాలు కూడా తెలియదంటే ఏమనాలి? లేక దక్షిణాది రాష్ట్రాల మీద ఉన్న నిర్లక్ష్యం, అనాసక్తి, ఆపేక్షారాహిత్యం, చిన్నచూపు వల్ల ఈ మహత్తరమైన గుడి గురించి తెలుసుకోలేదా?

**800 ఏండ్ల కిందట, సుమారు 40 ఏండ్లు శ్రమించి, భూకంపాలొచ్చినా చెక్కు చెదరని, అత్యద్భుత సాంకేతికతతో నిర్మించిన ఈ దేవాలయాన్ని 2021లోనే ప్రపంచ వారసత్వ చిహ్నంగా యునెస్కో గుర్తించాకైనా కనీసం రాజకీయ నాయకులైనా సందర్శించాలి కదా? ఇంత అజ్ఞానం, అనాదరణా? అసలు ఈ రాజకీయ నాయకులకు ఒక యూపీఎస్సీ పరీక్ష పెట్టాలి కదా! ఒక సామాన్య ఉపాధ్యాయుడికే శిక్షణలు, పరీక్షలున్నప్పుడు, దేశాన్నంతా పరిపాలిద్దామనే ఆశ, ఆశయం ఉన్నవారికి దేశంలోని ప్రసిద్ధ ప్రదేశాలైనా తెలియాలి కదా! బహుశా ఇటలీ గురించి ఏమడిగినా చెప్పేవారేమో వీళ్లిద్దరూ.**

తర్వాత ప్రియాంక తెలంగాణను పుణ్యభూమిగా వర్ణించారు. ఎందువల్ల? తమ స్వప్నాలు నాశనమై, రాష్ట్రం సిద్ధించక శ్రీకాంతాచారి లాంటి చాలామంది యువత నిస్పృహతో బలిదానాలు చేశారని విచారంగా చెప్పారు ప్రియాంక. అంటే రామప్ప దేవాలయ చరిత్రే కాదు, తమ వంశ రాజకీయ చరిత్ర కూడా తెలియనట్టుంది పాపం ఆమెకు.

తెలంగాణ యువత 1200 మంది, అంతకుముందు కూడా కొంతమంది ఉద్యోగావకాశాలు లేక బలిదానాలు చేయలేదు. అవన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిన హత్యలు. ఆఖరికి పార్లమెంటు భవనం దగ్గర ఉరేసుకొని చనిపోయిన యువకుడు, ఉస్మానియా క్యాంపస్‌లో నిలువుగా మంటల్లో కాలి చనిపోయిన యువకుడు, అందరూ చూస్తుండగానే 'జై తెలంగాణ' అంటూ పెట్రోల్ పోసుకొని తనను తాను కాల్చుకొని చనిపోయిన శ్రీకాంతాచారి – ఎవరూ కాంగ్రెస్ పెద్దల మనసు కరిగించలేకపోయారు. ఇక్కడ హోంమంత్రిగా ఉన్న జానారెడ్డి–ఇప్పుడు తెలంగాణ ప్రగతి సాధించాక వడ్డించిన విస్తరిలా ఉన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా స్వయం ప్రకటన చేసిన మనిషి – ఆ చావులు విద్యలో వెనుకబడ్డారనో, ప్రేమ విఫలమైందనో ప్రకటించి ఊరుకున్నారు వారి కుటుంబాలను కూడా పలకరించకుండా! బహుశా వారికి సరిజోడు మన ప్రధానమంత్రి మాత్రమే! చనిపోయిన జవాను కుటుంబాలకు ట్విట్టర్ మెసేజీ ఇవ్వకుండా, మణిపూర్ మారణహోమం ఆపకుండా నీరోలాగ నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం ఏ మానవుడికీ సాధ్యం కాదేమో బహుశా! మరి ప్రజాభిప్రాయం పట్టించుకోకుండా నెహ్రూ చేసిన పెండ్లి–ఒక అమాయకురాలికి, ఒక తుంటరి అబ్బాయికి– రెండవరోజు నుంచే పెటాకులైనా, ఆయన వెసులుబాటు కల్పించిన విడాకులకు సమయం 58 ఏండ్లు పట్టడం ఎంత వింత! దీనికి కేంద్రంలో 60 ఏండ్లు, రాష్ట్రంలో 49 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కారణం కాదా? నిజానికి ఏ మాత్రం తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్ర తెలిసిన ప్రియాంకకు ఆ చావులన్నీ, ఇంకా ఆ సమయంలో రైతులు, చేనేత కార్మికులు చేసుకున్న ఆత్మహత్యలన్నీ తాను ఓటేయమని అడుగుతున్న పార్టీ చేసిన హత్యలని తెలిసేది. ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వంలో నక్సలైట్ పేరు పెట్టి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేయించిన ఎన్‌కౌంటర్లు కూడా బూటకపు నాటకాలనీ తెలిసేది. పైగా ఆవిడ తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఆగలేదంది. కేంద్ర ప్రభుత్వ లెక్కల్లోనే తెలంగాణ ఆత్మ హత్యలలో చివరగా ఉంది. రైతుబంధు, రైతుబీమా, పుష్కలంగా నీళ్లు, రోజంతా కరెంటు ఇచ్చాక తెలంగాణ రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతారు? పైగా వారిళ్లల్లో ముసలివారికి ఆసరా పింఛన్లు, ఆడపిల్ల పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ప్రసవానికి చక్కటి ప్రభుత్వ ఆస్పత్రులు, కేసీఆర్ కిట్ ఇచ్చి ఇంటి దగ్గర దింపుతుంటే పల్లెల్లో ఉన్నవాళ్లకు కూడా ఏమి కష్టం? గర్భిణులకు ఆహారం, మహిళలు బయటికి వెళ్లకుండా భగీరథ మంచినీళ్ల వంటివి లభిస్తుంటే ఇంక బాధలేమిటి? చనిపోయినవారికి కూడా వైకుంఠధామాలు నిర్మించాక లేనిదేమిటి? దళితబంధు అంబేద్కర్ కలలు సాకారం చేయటం లేదా? వెయ్యిపైన పాఠశాలలు బడుగు, బలహీనవర్గాల పిల్లలకు అందడం పూలే కల కాదా? పోడు భూముల పంపకం, తండాలు మున్సిపాలిటీలై వసతులన్నీ రావడం కుమ్రుంభీం ఆశయం కాదా? మీ పార్టీ అవమానించి బయటికి పంపేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం, తన పేరుతో వెలుగుతున్న శాసనసభా భవనాన్ని సగర్వంగా వీక్షించటం లేదా? దానిమీద తన పేరు చూసి మీ చేతుల్లో జరిగిన అవమానానికి సమాధానం దొరికిందని తృప్తి పడటం లేదా?

ఇంకొక ముఖ్య విషయం ప్రియాంకా వాద్రా గట్టిగా చెప్పినది.. 'రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా, తన తల్లి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ప్రసాదించిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తీర్చిందని'. రాష్ట్రం ఇవ్వటానికి ఇవి కారణాలు కానే కాదు. ఒకవేళ అదే కారణమైతే 2009లో తన పుట్టినరోజు నాడు చేసిన రాష్ట్ర ప్రకటన వెనక్కి తీసుకునేవారు కాదు. అప్పటినుంచి ఫిబ్రవరి 2014 దాకా తాత్సారం జరిగేది కాదు. రాష్ట్రంలో ఉన్న మీ నాయకులు–రాష్ట్రాన్నిస్తే తమ పార్టీయే బ్రహ్మాండంగా గెలుస్తుందని, కేసీఆర్‌తో పొత్తు కూడా అక్కరలేదనీ చెప్పడంతో ఆమె ఆశపడ్డారు. అప్పటి దాకా తెలంగాణను దోపిడీ చేసిన ఆంధ్రా ప్రాంత నాయకుల చేతిలోని ఆంధ్రా జారిపోయినా, తెలంగాణలో అఖండ విజయం కలుగుతుందని ఆమె ఆశించారు. ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఈ ఉద్యమ వేడి తెలియలేదు. ఎన్నికలయ్యాక ఎవరు ముఖ్యమంత్రి అవుతారన్న ఆలోచనలు, తమకు మంత్రి పదవి కావాలనే తాపత్రయం తప్ప ఇంకో విషయం వారి బుర్రలో లేదు. పాపం వారి తెలివి తక్కువతనంతో సోనియాగాంధీని తప్పుదారి పట్టించారు. మరి ప్రియాంక ఈ చరిత్ర తెలుసుకొని ఉండాల్సింది, కాంగ్రెస్ పార్టీలోని నాయకులు, ముఖ్యంగా గాంధీ కుటుంబం మొదటిసారి టీఆర్‌ఎస్ ఎందుకు గెలిచిందని ఆత్మవిమర్శ చేసుకొని ఉంటే అర్థమయ్యేదేమో! నిజానికి ఒక సామెతలో చెప్పినట్టు 'జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్' అంటే 'ఆలస్యంగా న్యాయం దొరికినా అది న్యాయమని అనలేం' అని అర్థం. అంటే అప్పటికే చాలా ఘోరాలు, నష్టం జరిగిపోయి ఉంటుంది ఆ మనిషికో, ప్రాంతానికో, సరిగ్గా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో అలానే జరిగింది. ఎంత ఆస్తి నష్టం, ఎంత ప్రాణ నష్టం జరిగాక రాష్ట్రం ఇచ్చామని ఎగిరే పార్టీకి ఎంత సిగ్గులేని తనం ఉండాలి!

ప్రియాంక ఇంకో మాటన్నారు. నెహ్రూ, ఇందిర, మన్మోహన్, రాజీవ్‌గాంధీ తెలంగాణలో ఐఐటీ, ఐఐఎంలు ఏర్పాటుచేశారని! జరిగిన అన్యాయానికి ప్రతిగా ఏర్పడింది. హైదరాబాద్‌లో ఉన్న జేఎన్‌టీయూ క్యాంపస్ అసలు వరంగల్‌లో పెట్టాల్సింది. అనంతపూర్, కాకినాడలో పెట్టి, వరంగల్‌లో ఉండాల్సినది హైదరాబాద్‌కు జరపటంతో తెలంగాణ పిల్లలకు ఎంతో నష్టం జరిగింది. అది తెలియదు ప్రియాంకకు. ఇంకోటి ధరల పెరుగుదల గురించి. తమ కాలంలో ఇబ్బడిముబ్బడిగా ధరలు పెరగటంతోటే అది చూసి మోదీ అధికారంలోకి వచ్చాడని ఆవిడకు తెలియదా? ధరలు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉంటాయా? ఇంకా 40 లక్షల నిరుద్యోగులన్నారు. మరి కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఆంధ్రావారు ఎగరేసుకుపోతే కిమ్మనలేదే! వ్యవసాయంలో సాగునీరు, సర్‌ప్లస్ ఫండ్స్, ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని లలిత్ భార్గవ్ కమిటీ చెప్పినా మీ కాంగ్రెస్ ప్రభుత్వం, మీ నాయనమ్మ ఆ అన్యాయాన్ని సరిచేశారా? అది చెప్పండి ముందు.

**ఒక్క ప్రభుత్వ విశ్వవిద్యాలయం లేదన్నారు. విమెన్స్ యూనివర్సిటీ వచ్చిందని మీ నాయకులు, మీకు చెప్పాల్సింది పైగా యూనివర్సిటీల్లో నియామకాలు లేవన్నారు. అది ఫైల్ మీద సంతకం చెయ్యని మీ రామ్‌లాల్ లాంటి మా గవర్నర్‌ను అడగండి. పైగా మీరు అభియోగం వేసినట్టు బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే అయితే మాకు యూనివర్సిటీలు ఇచ్చేవాడు కదా మోదీ! 150 మెడికల్ కాలేజీలు, 100 నర్సింగ్ కాలేజీల్లో ఒక్కటి కూడా ఇవ్వని బీజేపీ ప్రభుత్వం, మా గిరిజన యూనివర్సిటీ ఎగరేసుకుపోయిన మోదీ, తెలంగాణ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యాడంటే మెడ మీద తలకాయ ఉన్నవాడెవడైనా నమ్ముతాడా!**

మీ నాయనమ్మ ఇందిరాగాంధీకి, గిరిజనులంటే ప్రేమ అన్నారు. వారిచ్చిన పూసలదండలు వేసుకొని వారితో డాన్స్ చేయడం తప్ప వారి తండాలు మున్సిపాలిటీలు చేశారా? వారికి అక్కడ పాఠశాలలు తెరిచారా? బీఆర్‌ఎస్ వారి హక్కులు లాక్కోలేదు. వారికి భూముల మీద హక్కులు ఇచ్చింది. పోడు భూములు పంచింది. దళిత బంధు ఇచ్చి దళితులను చిరు వ్యాపారులను చేసింది. ఆత్మ గౌరవంతో బతుకడానికి బాటలు వేసింది. వృత్తి వ్యాపారులకు లక్ష రూపాయలు ఇచ్చింది. అవినీతి, మోదీ రిమోట్ కంట్రోల్ ఉంటే ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా చేసేది తెలంగాణ ప్రభుత్వం? బీఆర్‌ఎస్ సొంత భవనాలు కట్టుకోలేదు. శాసనసభా భవనం, జిల్లాల వారి సౌకర్యానికి కలెక్టరేట్లు కట్టారు. ఒక కుటుంబంలో ముగ్గురు గవర్నమెంట్‌లో ఉన్నారంటున్నారు. అయితే ఒక కుటుంబంలో ముగ్గురు ప్రధానులుంటే ఏమనాలి? దేశంలో కులాల కుంపటి పెట్టి మంట రాజేసిందే మీరు. ఆర్థిక అసమానతలు తొలగేటట్టు మీ ముత్తాత పాలించి ఉంటే ఈనాడు ఈ దౌర్భాగ్యం ఉండేది కాదు కదా?

**ఇక మీ పార్టీ పాలించే రాష్ట్రాల్లో చెప్పినవన్నీ చేశామనీ, ప్రజలు సంతోషంగా ఉన్నారనీ చెప్పారుగా ప్రియాంకా గారూ! నిన్న ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఎంత బ్రహ్మాండంగా పథకాలు అమలు చేస్తోందో చూద్దామా?**

కర్ణాటకలో అయిదు గ్యారెంటీలు ఇచ్చారు కాంగ్రెస్ వారు. అవన్నీ ప్రియాంక గాంధీ నోట ధాటిగా విన్న ప్రజలు మురిసిపోయి కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. అయిదు నెలలు కాకుండా మాటలన్నీ నీటి మూటలయ్యాయి. గృహజ్యోతి–200 యూనిట్ల ఉచిత కరెంటు దేవుడెరుగు, మామూలు కరెంటులో కూడా ఘోరమైన కోతలు పెడుతోంది. కరెంటు 'గృహజ్యోతి' ఆరిపోయింది. 'అన్నభాగ్య' అభాగ్య అయింది. ఇంటింటికీ 10 కిలోల బియ్యం ఇస్తామని చెప్పి, ఇప్పుడు బియ్యం లేవు, కిలోకు రూ.9 చొప్పున డబ్బులిస్తామంటున్నది. ప్రపంచమంతా గాలించినా రూ.9కి కిలో బియ్యం దొరుకుతాయా? మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణమని గొప్పగా ప్రకటించి నెలలోనే కర్ణాటక ఆర్టీసీ దివాళా తీసేసింది. ఇప్పుడు అందులో కొర్రీలు పెడుతోంది. 'శక్తి' పథకం ఆ రకంగా 'శక్తిహీన' అయింది. తెలంగాణలో చెప్పినట్టే ప్రతి మహిళకు నెలకు 2000 ఇస్తామన్న కర్ణాటక ప్రభుత్వం ఒక్క నెలకే చేతులెత్తేసింది. 'గృహలక్ష్మి' పథకం 'జ్యేష్టాదేవి' తీసేసుకుంది. డిగ్రీ పాసైన ప్రతి నిరుద్యోగికి నెలకు 3,000 ఇస్తామనీ, త్వరలో నోటిఫికేషన్లు ఇస్తామనీ చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అయిదు నెలలైనా ఈ పథకం మొదలుపెట్టలేదు. 'యువ నిధి' కాస్తా కర్ణాటక రాజకీయ నాయకుల నిధి అయి వెయ్యి కోట్ల ధనాన్ని తెలంగాణ ఎన్నికల్లో పంచేందుకు దాచిపెడితే అది పోలీసులు పట్టుకున్నారు.

**కాంగ్రెస్ తమ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చేస్తున్న నిర్వాకం ఇదీ. పెద్ద ఉపన్యాసం ఇచ్చిన ప్రియాంకా వాద్రా చివరికి ఒక మంచి మాట చెప్పారు. జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలి. వివేకంతో వేయాలి. మీ వికాసం కోసం వేయాలి, నాయకుల వ్యక్తిత్వం చూడండి. భవిష్యత్తు కోసం, తెలంగాణ కోసం, సామాజిక న్యాయం కోసం ఎన్నికలో మీ ఓటు వేయండి. ఇది మాత్రం నిజం. కేసీఆర్ కూడా ఇదే మాట చెప్తారు.**

ఇప్పుడు చైతన్యంతో కాంగ్రెస్ 49 ఏండ్ల పాలనలో వారి వ్యక్తిత్వం చూసిన అనుభవంతో, వికసించిన వివేకంతో ఉద్యమకాల జ్ఞాపకాలతో, అమరుల మీద ప్రేమాభిమానాలతో తెలంగాణ ప్రజలు నిర్ణయించుకోవాలి. 'ఎ బర్డ్ ఇన్ హ్యాండ్ ఈజ్ వర్త్ టూ ఇన్ ద బుష్' అంటే దూరంగా ఉన్న రెండు పిట్టల కోసం చేతిలోని పిట్టని వదిలేస్తారా? ఉద్యమ నాయకుడా? ఊరించే ఓటుకు నోటు నాయకుడా? అన్న మాట తప్పనివాడా? అనృతం తప్ప నిజం చెప్పనివాడా? చెప్పని పథకాలు కూడా ప్రజల అవసరాలను బట్టి చేసే నాయకుడా? చెప్పినవి కూడా ఎగేసే వ్యక్తా? రాష్ట్రాన్ని సాధించినవాడా? రాష్ట్రాన్ని జాతీయ పార్టీ పాదాల దగ్గర పెట్టేవాడా? తెలంగాణ వాదా? తెలంగాణ వ్యతిరేకా? ఎవరు కావాలో జాగ్రత్తగా ఎన్నుకోవటం విజ్ఞుల లక్షణం. మీ భవిష్యత్తు మీ చేతిలో!

# ప్రగతికి పట్టం కడదాం!



డాక్టర్ అనభేరి రాజేశ్వర్‌రావు
77022 97068

స్వాతంత్ర్యానంతరం.. నాటినుంచీ నేటి దాకా జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాల నాయకులు, వక్తలు, మేధావులు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను, ప్రభుత్వాల్లోని లొసుగులను ఎత్తిచూపుతూ, విమర్శిస్తూ తమను గెలిపించాల్సిందిగా, తమకు అవకాశం కల్పించవలసిందిగా కోరారు. కానీ, దేశాన్ని, మానవ, ప్రకృతి వనరులను సద్వినియోగపరుచుకునేందుకు ఎలాంటి ఆచరణాత్మక, సంక్షేమ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించలేదు. అంతేకాకుండా ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు తమ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆచరణాత్మకంగా రూపొందించి అమలుచేయలేదు.

భవిష్యత్తు ప్రణాళిక, దూరదృష్టి లేకుండానే అధికార దాహంతో ఒకరిపై ఒకరు బాధ్యతారహితంగా విమర్శించుకున్నారు. గెలుపే ప్రధాన ధ్యేయంగా వారు సమావేశాలు నిర్వహించుకోవటం, కుల, మత, జాతి, వర్గ, ప్రాంత, భేదాల్ని సృష్టిస్తూ.. 'విభజించు–పాలించు' అనే రాజనీతితో ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. నల్లడబ్బును విచ్చలవిడిగా ఓటర్లకు పంచటం, హింసాత్మక ధోరణులు సృష్టించటం ప్రధాన ధ్యేయంగా ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆకాంక్షతో ఉండేవాళ్లు నేటితరం.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ పరిపక్వత పైవాటికి భిన్నమైనది. జల, ప్రకృతి, మానవ వనరులను సంపూర్ణంగా సద్వినియోగపరుచుకునే విధంగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాల రూపకల్పన చేయటంలో ఆయన దిట్ట. రాష్ట్రంలో నిరంతరం విద్యుత్తు సౌకర్యాన్ని కల్పిస్తూ డెబ్బై శాతానికి పైగా ఉన్న గ్రామీణ వ్యవసాయరంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించి ప్రజలకు కనీస అవసరాలైన మంచినీరు, తాగునీరు, సాగునీరందించి భూ, జల వనరులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పంపిణీ చేసి సస్యశ్యామలం చేసేందుకు తపన పడుతున్న మన కేసీఆర్ మరో భగీరథుడే.

**మన దేశ చరిత్రలో ఇలాంటి విజన్‌తో ఉన్న నాయకులు ఎంతమంది? రైతు సంక్షేమం, భద్రత, వ్యవసాయరంగాభివృద్ధి, శాస్త్ర, సాంకేతిక రంగాభివృద్ధి ప్రధాన ధ్యేయంగా నిరంతరం విద్యుత్తు సౌకర్యాన్ని కల్పిస్తూ గ్రామీణ, పట్టణ పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతున్న నాయకులెందరు? మహిళాభ్యుదయానికి, సహకార రంగాభివృద్ధికి, ప్రజలకు నిరంతరం రక్షణ కల్పిస్తూ జాతీయ సమైక్యతతో అన్ని కుల, మత, ప్రాంత ప్రజల సౌకర్యార్థం శాంతియుత వాతావరణంలో జీవనం కొనసాగించేందుకు నిరంతరం శాంతి భద్రతలను పటిష్ఠంగా అమలుపరిచేందుకు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రులెందరు? ఒక్క మన కేసీఆర్ తప్ప.**

నాడు ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజపేయి, వీపీ సింగ్, చరణ్‌సింగ్, పీవీ నరసింహారావు లాంటి నాయకుల వల్ల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన మార్గదర్శకత్వం వల్ల భారతదేశం కొంత అభివృద్ధి చెందింది. దేశంలో ఆర్థిక సంస్కరణలకు, రాజ్యాంగ సవరణలకు శ్రీకారం చుట్టబడింది. నాటి నుంచి మన దేశంలో నేటితరంలో ఒక భవిష్యత్తు విజన్ ఉన్న మేధావి, కార్యదీక్షాపరుడు, సాహసి, ధైర్యం, దమ్మున్న యుగ పురుషుడు, ఇద్దరు పార్లమెంట్ సభ్యులతో 32 రాజకీయ పార్టీల మద్దతు పొంది అహింసా విధానంలో మహాత్మాగాంధీ మార్గదర్శకత్వ విధానాల అమలు వల్ల పదిహేనేండ్ల నిర్విరామ అవిశ్రాంత కృషి, పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత మన కేసీఆర్, తెలంగాణకు ఆహుతైన అమరులది.

రాష్ట్రంలోని మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, యువకులు, స్త్రీ, పురుషులు రాజకీయాలకతీతంగా గతంలో కేసీఆర్‌కు, పదేండ్ల పాలనకు మద్దతు నిచ్చినట్టే నేటి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో సైతం బీఆర్‌ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతునిచ్చేందుకు ముందుకువస్తుండటం ముదావహం. శాంతిభద్రతల పరిరక్షణలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాభివృద్ధిలో,



విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో విద్య, వైద్య సదుపాయాలను కల్పించి ప్రజలందరికీ సుపరిపాలనను అందించడంలో నిరంతరం కృషిచేస్తోన్న దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు తపిస్తోన్న మన కేసీఆర్‌కు వారి మద్దతు లభిస్తుండటం అభినందనీయం. ఆయన మార్గదర్శకత్వంలో భారతదేశానికి వన్నె తెచ్చే విధంగా భవిష్యత్తు నాయకుడిగా ఎదుగుతూ నిర్విరామకృషితో దేశాభ్యుదయానికి, తెలంగాణ పారిశ్రామికరంగానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించటంలో కృషిచేస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డైనమిక్ యంగ్ లీడర్ కేటీఆర్‌కు మనమంతా మద్దతునిచ్చి ప్రోత్సహించి మరోమారు తెలంగాణలో బీఆర్ఎస్‌కు అవకాశం వచ్చేలా చేయవలసిన అవసరం ఉన్నది. సంకుచిత జాతీయ పార్టీలను, తెలంగాణాభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్న తెలంగాణ వ్యతిరేకశక్తులను తరిమికొట్టి డిపాజిట్ గల్లంతయ్యేలా జాగరూకతగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది. ఇదే నేటి రాష్ట్ర పౌరుల విధి, ఎన్నికల్లో అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొని ప్రగతిని కాంక్షించే పార్టీకి మద్దతునివ్వటం పౌరులుగా మన బాధ్యత.